

ఆదొక ప్రయివేట్ కంపెనీ.

ఆ కంపెనీ వున్నట్టుండి ఓ రికార్డ్ 'బ్రేక్' చేసింది!

దాదాపు నగరంలోని అన్ని కంపెనీలు ఏదో విషయమై నెలకో హర్తాళ్, ఆరునెలలకో 'స్ట్రయికు' వదలకుండా టంచనుగా చేస్తున్న ఈ రోజుల్లో, ఆ కంపెనీలో గత ఐదేళ్ళుగా మచ్చుకొకటైనా 'సమ్మె' జరగ లేదంటే అన్‌బిలీవబుల్‌గా లేదూ? అసలు ఈ విషయం శ్రీమాన్ యాజమాన్యం వారికి 'హేపీ'గా వుండగా, తక్కిన ఆఫీసులకు 'ఐడియల్'గానూ, మరి కొంత మందికి జెలసీగానూ తయారయింది.

మామూలుగా ఆ ఆఫీసులోనూ అన్ని రకాల-ఐమీన్-అన్ని క్లాసుల గుమాస్తాలూ వున్నారు. వారికీ యూనియన్లు వున్నాయి. ఆ యూనియన్లకు నాయకులూ వున్నారు. ఆ లీడర్లకు కనీసం నెలకో స్ట్రయికయినా చేద్దామన్న సరదాకూడా వుంది. ఇన్ని వున్న ఆ కంపెనీలో మరి స్ట్రయికులు లేవంటే విడ్డూ



రంగానే వుంటుంది. ఈ వైపరీత్యానికి కారణం ఆ కంపెనీ జనరల్ మానేజరు శివరావ్—శివరావ్ ది గ్రేట్!

'శివరావ్, ది బ్రిలియంట్ గై' అని యాజమాన్యం వారు ముచ్చటపడితే, 'బాబోయ్, యముడొస్తున్నాడు' అని భయపడతారు గుమాస్తాలు. ఐదేళ్ళుగా సమ్మెలులేవంటే దానికి కారణం శివరావ్ గొప్ప

తవమే. ఆ శివుడికి మూడు కళ్ళైతే ఈ శివరావ్‌కి మూడువందల ముప్పై మూడు కళ్ళు. యూనియన్ లీడర్లు ఏ విషయంలో స్ట్రయికు చేయగలరో ముందుగానే ఊహించేసి, దాన్ని నోటితో ఊదేయగల దిట్ట! సమ్మెలకోసం గోతిదగ్గర నక్కల్లా కాచుకు కూర్చునే యూనియన్ లీడర్ల పాలిటి సింహస్వప్నం

శివరావ్! ఈ ఐదేళ్ళలోను అజిటేట్ చేయటానికి ఒక్క పాయింటూ దొరక్క, 'ఇకమీదట స్ట్రయికు చేస్తే మా మీద ఒట్టు!' అన్నట్లు చప్పబడిపోయారు లీడర్లు.

ఆఫీసు విషయాలపై ఎంతో మంది పెద్దలు ఆ ఆఫీసును తరచు విజిట్ చేస్తూనే వుంటారు. విజిట్ చేసినప్పుడల్లా ఆ ఆఫీసు అట్మాస్ఫియరుకి, డిసిప్లిన్‌కి శివరావ్‌న

ప్రెయిజ్ చేయకుండా వుండలేరు. అలాంటి సమయాల్లో శివరావ్ హృదయం ఆనందంతో పొంగి పోయేది. దూదిపింజలా తేలి పోయేది. కానీ ఎక్కడో హృదయపు అట్టడుగు పొరల్లో ఏదో అసంతృప్తి! తను తన తోటివారికి అన్యాయం చేస్తున్నానేమోనన్న అనుమానం! శివరావ్ ఓ మధ్య తరగతి కుటుంబం నుండి స్వయం కృషితో, దీక్షతో పైకెగబ్రాకిన వాడు. పేదవాళ్ళ బాధలూ, మధ్య తరగతి వారి అవస్థలూ, ధనికుల 'టాక్టిక్స్'-ఇవన్నీ శివరావ్‌కి తెలిసిన విషయాలే! కాని తెలియని దల్లా—'తను గుమాస్తాల నోరు నొక్కి, మిడిల్ క్లాసు లోటుపాట్లు పై వారికి తెలియజేసుకోకుండా చేసి, డిసిప్లిన్ అన్న పేరుతో వాళ్ళ ఫ్రీడమ్‌ను దోచేసి, వాళ్ళ శ్రమతో లాభాలు సంపాదించి, యజమానుల బ్లాక్ మనీని ఎక్కువ చేస్తున్నానా?'— అన్న ప్రశ్నకు సమాధానం.

'మనం పనిచేస్తుంది డబ్బు కోసం. పనిచేస్తున్నాం—ప్రతిఫలంగా జీతం తీసుకుంటున్నాం. పైవాళ్ళు పెద్దపెద్ద మొత్తాలను పెట్టుబళ్ళుగా పెట్టి, పెద్ద మొత్తాల్లోనే లాభాలు గడిస్తున్నారు. ఒకవేళ నష్టాలు వచ్చినా హ్యూజ్ అమౌంట్సులోనే. ఒకవేళ కంపెనీకి బాగా వస్తే నష్టపోయేది ఎవరు? మనం హాయిగా వేరే చోటికి వెళ్ళి జాబ్ చేసుకోవచ్చు. కానీ వాళ్ళలా కాదుగా? కాబట్టి దీనిలో అన్యాయం లేదు. జీతం తీసుకుంటున్నాము కాబట్టి నమ్మకంగా డిసిప్లిన్డ్‌గా పని చేయడం మన ధర్మం'—ఇది శివరావ్ తన మనస్సుకు [సంజాయిషీగా] డైరక్టుగానూ, ఎంప్లాయీస్‌కు ఇండైరక్టుగానూ చెప్పే సమాధానం. కానీ ఈ సమాధానానికి శివరావ్ తనకు తాను పూర్తిగా శాటిస్‌ఫైడ్ కాగలిగాడా—అన్న దానికి సమాధానం లేదు.

* * *

ఆ రోజు కంపెనీ బోర్డు మీటింగ్.

మీటింగ్‌లో 'ఏకగ్రీవంగా' పాసయిన ఒక రిసల్యూషన్—

"....గత నాలుగైదేళ్ళుగా కంపెనీలో మచ్చుకైనా సమ్మె అన్నది లేదు. ఉద్యోగులందరూ ఒళ్ళు వంచి డిసిప్లిన్డ్‌గా పని చేసినట్లు వచ్చిన లాభాలు చెప్తున్నాయి. ఈ డెవలప్‌మెంట్సుకి యాజమాన్యం వారు చాలా సంతోషిస్తున్నారు. ఈ సందర్భంలో ఒక

శుభవార్త—ఉద్యోగస్తు లందరికీ రెండు నెలల జీతం బోనసుగా ఇవ్వబడుతుంది."

మొదట్లో ఈ తీర్మానానికి మేనేజ్‌మెంటు వారు అసలు ఒప్పుకోలేదు. కానీ శివరావ్ గంట న్నర సేపు 'ఆర్గ్యూ' చేసి చివరకు వారిని కన్విన్స్ చేయగలిగాడు. తను తన వారికి అన్యాయం చేస్తున్నా నేమోనన్న అనుమానం శివ రావ్‌లో రోజు రోజుకీ ఎక్కువ కాసాగింది. అంత కర్కశంగా వుండే వ్యక్తి, ఏకాంతంలో మన స్సాక్షికి ఎదురు తిరగలేక పోయాడు. ఏదో సాధ్యమయి నంత చేద్దామన్న ఉద్దేశంతోనే శివరావ్ తీర్మానాన్ని చేసి యాజ మాన్యాన్ని ఒప్పించి, మెప్పించ గలిగాడు.

* * *

అనుకోని ఈ అదృష్టానికి ఉద్యోగులందరూ చాలా సంతో షించారు. వచ్చే డబ్బుతో ఏం చేద్దామా? అని కొందరు ఒకచే లజ్జుగుజ్జు అవుతున్నారు. కానీ యూనియన్ లీడర్లు-కాలాంతకులు. యాజమాన్యం వారి 'జాలీమూడ్'ని పసిగట్టేరు.

వాళ్ళకీ ఈ విషయం ఆనంద కరంగానే వున్నా, ఇటువంటిదేదో రివార్డు రాబోతుందని తామెప్పటి నుండో ఊహిస్తున్నామనీ, కానీ ఆ వచ్చేది 'మరీ ఇంత తక్కువ' అనుకోలేదనీ-పెద్ద ప్లే చేశారు. ఈ సమయంలో డిమాండ్ చేస్తే మరికొంత ముట్టగలదని విగతా వారికి నూరిపోశారు. 'అయి దేళ్ళుగా ఇంత కష్టపడినందుకు ఈ 'ముష్టి' ఇవ్వడం భావ్యం కాదు. కనీసపక్షం ఆరు నెలల జీతం బోనసు ఇవ్వవలసింది'గా నోటీసు జారీచేశారు.

అందరూ ఊహించినట్లుగా ఈ 'గ్రిడీ డీడ్'కి మేనేజ్‌మెంటు ఒప్పు కోలేదు. కానీ ఎవరూ ఊహించన ట్లుగా కంపెనీ ఉద్యోగులు పెద్ద ఎత్తున సమ్మెను స్టార్టు చేశారు.

'సమ్మెలు లేవని, డిపెండెన్స్‌గా పని చేశారని జనరస్‌గా బోనస్ డిక్లేరు చేసినందుకు కృతజ్ఞతగా పెద్ద ఎత్తున సమ్మె! లాకౌట్!' శివరావ్‌కి లోపమెక్కడుందో అంతు చిక్కలేదు. ఆలోచనలకు శక్తిలేకుండా మెదడు మొద్దుబారి పోయింది.

* * *

నెల రోజుల తరువాత—

అలవాటుగా యాజమాన్యం వారు యూనియన్ లీడర్లతో రాజీ కుదుర్చుకొని, సమ్మె విరమింప జేశారు!

పనిలో పనిగా, అసలీ అలజడి కంతటికీ శివరావ్‌ని కారకుడిగా పరిగ ణించి, 'డిస్మిస్' చేసారు! ●